హైదరాబాద్ వార్త



# అక్రమ వసూళ్లకు అడ్డాగా 'సీఈఐజీ'

-భవనాలు తనిఖీ చేయకుండానే ఎన్‌వోసీల జారీ
-అపార్ట్‌మెంట్లు,పరిశ్రమలు ఒక్కోదానికి ఒక్కోరేటు
-ఏజెంట్ల ద్వారా వస్తేనే పని...లేదంటే కిరికిరి
-40మంది పనిచేయాల్సిన చోట 15మందే దిక్కు
-ఇటీవల నగరంలో పెరిగిన వరుసగా అగ్ని ప్రమాదాలు
-విద్యుత్ తనిఖీ విభాగం చర్యలపై వినియోగదారుల్లో జోరుగా చర్చ




**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తనిఖీ చేయాల్సిన విభాగం లో అవినీతి పేరుకు పోవడం వల్ల ఇటీవల నగరంలోని హైరైజ్ బిల్డింగ్స్ లోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా.. పకడ్బందీగా.. అత్యధిక వ్యయాలతో నిర్మిస్తున్న ఆకాశహర్మ్యాల లోనూ విద్యుత్ ప్రమాదాలు జరగడంపై విస్మయం వ్యక్తమవుతోంది. కారణం మెజార్టీ హైరైజ్ భవనాలను థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లు నిర్మించడం. అంతర్గత విద్యుత్ పనులు సైతం ఆకాంట్రాక్టర్లతోనే చేయిస్తున్నారు. వీరు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం తాత్కాలిక అవసరం కోసం లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు వాడుతున్నారు. కంటికి కన్పించే ప్లగ్‌లు, స్విచ్‌బోర్డులు, లైట్లు మినహా గోడలు, స్లాబులో వాడే వైర్లు నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో సామర్థ్యానికి మించి ఏసీలు, వాషింగ్ మిషన్లు, గ్రీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించడం వల్ల ఒత్తిడికి గురై కేబుళ్ల జాయింట్ల వద్ద షార్ట్ సర్క్యూట్లు జరుగుతున్నాయి. సాధారణ భవనాలతో పోలిస్తే.. సీఈఐజీ అనుమతులు, పీరియాడికల్ ఇన్స్పెక్షన్లు పొందిన బహుళ అంతస్తుల భవనాల్లోనే ఈ విద్యుత్ షార్ట్సర్క్యూట్లు ఎక్కువ జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

**సీఈఐజీ విభాగం ఏం చేస్తుంది..?**

విద్యుత్ కేబుళ్లు, పరికరాల నాణ్యతను పరిశీలించి, వాటికి అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్ టు గవర్నమెంట్ (సీఈఐజీ) విభాగాన్ని ఏర్పాటు చేసింది. పరిశ్రమలతో పాటు 15 మీటర్ల ఎత్తు దాటిన ప్రతి వాణిజ్య, గృహ సముదాయానికి విద్యుత్ తనిఖీ అధికారి ఎన్‌వోసీ తప్పని సరిచేసింది. భవిష్యత్తు విద్యుత్ అవసరాలు, ఎంపిక చేసిన విద్యుత్ సామర్థ్యం, ఇన్‌కమింగ్ లైన్, అంతర్గత విద్యుత్ లైన్లు, వినియోగించే కేబుళ్లు, ఏబీ స్విచ్లు, ఎర్తింగ్ సిస్టం సహా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు (డీటీఆర్) వంటివన్నీ పక్కాగా ఉన్నట్లు నిర్ధారించిన తర్వాతే ఆయా భవనాలకు నిరభ్యంతర పత్రం జారీ చేయాల్సి ఉంది. కానీ మెజార్టీ భవనాలకు కనీస తనిఖీ చేయకుండానే ఎన్‌ఓసీలు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఒక్కో అపార్ట్మెంట్‌కు ఎంపిక చేసిన విద్యుత్ లోడును బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్షన్నర వరకు వసూలు చేస్తున్నారని, వాణిజ్య భవనాలు, పరిశ్రమలైతే ఏకంగా రూ.7నుంచి 10 లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**ఏజెంట్ల ద్వారా వస్తేనే...**

సీఈఐజీ అనుమతుల కోసం ఆయా అపార్ట్ మెంట్లు, పరిశ్రమలు టీఎస్ ఐపాస్‌లో డ్రాయింగ్ అప్రూవల్స్‌ను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. సీఈఐజీ కనుసన్నల్లో మెలిగే ఏజెంట్ల ద్వారా వచ్చిన వాటికే అనుమతులు ఇస్తూ.. ఇతర మార్గాల ద్వారా వచ్చే ఫైల్సు వివిధ చూపించి ఆయా సాంకేతిక అంశాలను సాకుగా తిరస్కరిస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో వినియోగదారులు సీఈఐజీ ఏజెంట్‌ను ఆశ్రయించి అనుమతులు పొందాల్సిన దుస్థితి నెలకొంది.

**ఒక్క అధికారికి నాలుగు పోస్టులు..**

విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పదేళ్లుగా కొత్త నియామకాలు లేకపోవడం, ఉన్నవాళ్లకు పదోన్నతులు రాకపోవడంతో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ హైదరాబాద్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ రూరల్, ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ పోస్టుల్లో ఒక్కరే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికే ఉన్న 17,130 హెచ్‌టీ కనెక్షన్లకు పీరియాడికల్ ఇన్స్పెక్షన్లు నిర్వహించడంతో పాటు కొత్తగా పుట్టుకొచ్చే చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు, సినిమా థియేటర్లు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, హోటల్స్, ఐటీ, అనుబంధ సంస్థల కార్యాలయాలు, క్రషర్ మిషన్లు, రెడీమిక్స్ ప్లాంట్లు, గృహ, వాణిజ్య బహుళ అంతస్థుల భవన సముదాయాలను తనిఖీ చేసి, వాటికి అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండటం, ఒక్కరే ఈబాధ్యతలన్నీ నిర్వర్తించాల్సి రావడంతో అనుమతుల జారీలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది.



ఒడిశా ఫౌండేషన్ డే సందర్భంగా రాజ్ భవన్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల దృశ్యం

# హెచ్‌సియూ భూములపై ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలి




ఓ.యూలో ప్రభుత్వ నిర్ణయం పై ప్లకార్డులతో నిరసన వ్యక్తం విద్యార్థి సంఘాల నాయకులు

**తార్నాక, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** విద్యార్థుల ఆందోళనలు,ర్యాలీల, అరెస్టులతో కొన్ని రోజులుగా ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మరో వైపు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల వేలం కారణంగా కూడా రెండు రోజులుగా ఓ.యూలో విద్యార్థులు తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మరియు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారన్నారు. ఓ.యూలో వివిధ విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజ్ వద్ద వీరిని పోలీసులు అడ్డుకొని పిఎస్‌కు తరలించారు. ఓ.యూలో అందళన చేసిన బీఆర్ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌తో పాటు పలువురి బీఆర్ఎస్వీ నాయకులను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు డా. తుంగబాలు, కార్పోరేటర్ డా. సామల హేమ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి, ఓ.యూ అద్యక్షులు ఉదయ్,డా.సత్యవతి మాట్లాడుతూ హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నేతలు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వేలం వేస్తున్నది హెచ్ సియు భూములను కాదు, హైదరాబాద్ ఊపిరితిత్తులను.. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్ సియుకి 2300 ఎకరాల భూమిని ఇస్తే, నేడు అదే పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ భూములను అమ్మడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పాలన చేతకాక, పన్నులు రాబట్టక, భూములను అమ్మి జీతాలు ఇవ్వాలని చూస్తున్న రేవంత్ రెడ్డి, ఇలాంటి చేతగాని ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ముందు రేవంత్ రెడ్డి "ప్రభుత్వ భూమి ఒక గుంట కూడా అమ్మకుండా చూస్తాం" అని చెప్పి, నేడు యూనివర్సిటీ భూములు ఎలా అమ్ముతున్నాడని ప్రశ్నించారు. ఉద్యోగాలు భర్తీ చేయడం, పథకాలు ప్రజలకు అందించడం చేతగాక, నేడు భూములను కాపాడాలని నిరసన తెలియజేసిన విద్యార్థులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి రాష్ట్రంలో ఒక నిర్బంధకాండ కొనసాగిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. నాడు యూనివర్సిటీలో రోహిత్ వేముల చనిపోతే రెండుసార్లు వచ్చిన రాహుల్ గాంధీ, ఈ రోజు విద్యార్థులపై దాడి జరుగుతుంటే కనీసం స్పందించడం లేదు... ఎందుకో అన్నారు. ప్రజాస్వామ్య వాదులారా, పర్యావరణ రక్షకులారా ఈరోజు యూనివర్సిటీ భూములను కాపాడడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. భూముల వేలం ప్రక్రియను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థుల మీద పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలి లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన ధర్నాలు, రాస్తారోకోలు చేపడతాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిద విద్యార్థి సంఘాల నాయకులు పుట్ట లక్ష్మణ్, విజయ్, నవీన్, కిరణ్ గౌడ్, సుమంత్, చటారి దశరత్, నాగేందర్, జంగయ్య, శ్రీమాన్, రమేష్ గౌడ్, శ్రీనునాయక్, గ్యార నరేష్, క్రాంతి, సత్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

# 6 నుండి సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్




వివరాలు వెల్లడిస్తున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షురాలు ఎస్‌వి.రమా తదితరులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** సమాజంలో అన్నిరకాల దోపిడీ, అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి వీటి నుండి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సిఐటియు తన ఆవిర్భావం నుంచి పని చేస్తున్నదని, ఇందులో భాగంగా 6వ తేదీ నుంచి 14 వరకు తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ నిర్వహించాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన మీడియాప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపధ్యక్షురాలు ఎస్‌వి.రమా వివరాలు వెల్లడించారు. ఈ క్యాంపెయిన్లో సిఐటియు అనుబంధ సంఘాలన్నీ భాగస్వాములు కావాలని, రాష్ట్ర కార్మికవర్గంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ను విజయవంతం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. 6న కార్మికోద్యమ నేత సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు బిటి రణదివే వర్ధంతి, ఏప్రిల్ 10న శ్రామిక మహిళా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన ఉద్యమ నేత విమల రణదివే జయంతి, ఏప్రిల్ 11న భారతీయ సామాజిక సంఘసంస్కర్త జ్యోతిరావుపూలే జయంతి, ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత, సామాజికోద్యమకారుడు బి.ఆర్. అంబేద్కర్ జయంతులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిస్తున్నది.సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ సందర్భంగా మండల కేంద్రాల్లో సమకాలీన పరిస్థితుల్లో భారత రాజ్యాంగం అంబేద్కర్ కార్మికవర్గ కర్తవ్యం" అనే అంశంపై సదస్సులు, సెమినార్లు నిర్వహించాలని, 12న బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సెమినార్" ను జయప్రదం చేయాలి. సామాజిక న్యాయ సాధన యాత్ర పేరుతో ఏప్రిల్ 13న జిల్లాలో 15 కిలో మీటర్ల బైక్ ర్యాలీలు నిర్వహించాలి. ఏప్రిల్ 8, 9, 10 తేదీల్లో సిఐటియు అనుబంధ యూనియన్లన్నీ కార్మికుల నుండి భారీగా సామాజిక సంఘీభావ నిధిని వసూలు చేయాలి. ఏప్రిల్ 14న సిఐటియు అన్ని అనుబంధ యూనియన్లు బి.ఆర్. అంబేద్కర్ జయంతిని జరపాలని సిఐటియు కోరింది. 77 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా పట్టణ ప్రాంతాల్లో దళిత ఉద్యోగ, కార్మికులకు ఇండ్లు అద్దెకు ఇవ్వకపోవడం శోచనీయమని, దళితులకు గుడి ప్రవేశం లేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని ప్రాంతాలు, హెటల్లో రెండు గ్లాసుల పద్ధతి, పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే అగ్రవర్ణ విద్యార్థులు తినకపోవడం లాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడకుండా సామాజిక న్యాయం సాధించలేమని ఈ లక్ష్యంతోనే రాష్ట్రంలో జరుగుతున్న సామాజికోద్యమాలకు కార్మికవర్గం బాసటగా నిలవాలని సిఐటియు కోరింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వి.ఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి. సుధాకర్, ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేట కోదండ రామాలయంలో వసంత నవరాత్రులు

-6న శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవం



**బేగంపేట ఏప్రిల్ 1,ప్రభాతవార్త** బేగంపేట ప్రకాశంనగర్‌లోని శ్రీరామలింగేశ్వర దేవాలయంలో ఉన్న కోదండ రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి,ఈ సందర్భంగా ఆలయాన్ని రకరకాలైన పూలు,రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.ఈ నెల 6వ తేదీన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈ ఓ విఠలయ్య,శ్రీభూలక్ష్మమ్మ ఆలయ నిర్మాణదాత విశాల్ సుధాం లు తెలియజేసారు.మార్చి నెల 30వతేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 6వ తేదీన జరగనున్న శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవంతో ముగియనున్నాయి.వసంత నవరాత్రుల సందర్భంగా కోదండ రామాలయంలో ప్రతి రోజు ఉదయం గం 9లకు దంపతులచే విశేష నిత్యార్చన,తీర్థ ప్రసాదాల వితరణ ,సాయంత్రం6గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ,రామాయణ పారాయణము,తీర్థ ప్రసాదాల వితరణ చేస్తున్నారు.కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా 3న గురువారం సాయంత్రం గం 5లకు పసుపు దంపుడు కార్యక్రమం,కళ్యాణ వేడుకలు, స్వామి వారిని ,అమ్మవారిని పెళ్లి కొడుకు,పెళ్లి కూతురుగా అలంకరించే కార్యక్రమం భక్తుల చేతుల మీదుగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు తమతో పాటు పూలు,పండ్లు, తమలపాకులు,ఏదైనా ఒక స్వీటు,తీసుకు రావాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు తప్పని సరిగా (డ్రెస్ కోడ్) పసుపు రంగు వస్త్రాలు ధరించి వస్తే బావుంటుందన్నారు.6వతేదీన ఉదయం గం 11.52నిలకు మిధున లగ్న పుష్కరాంశ సుముహూర్తమున మిథిలాధిపతి,జనక నందిని అయిన సీతామాతను ,అయోధ్యాధిపతి దశరథ నందనుడు అయిన శ్రీరామ చంద్రునితో తిరుక్కళ్యాణ మహోత్సవము అంగ రంగ వైభవంగా భక్తులతో జరిపేలా నిర్ణయించామన్నారు.కళ్యాణమహోత్సవం అనంతరం అన్నదాన సంతర్పణ ఉంటుందన్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి కళ్యాణమహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు తెలియజేసారు.

# ఆధ్యాత్మిక గ్రంథాలు మరిన్ని రావాలి




ఆధ్యాత్మిక గ్రంథాలను ఆవిష్కరిస్తున్న సంస్కృత అకాడమీ డైరెక్టర్ పెన్న మధుసూదన్, జగద్గురు గంభీరానంద భారతీమహాస్వామి, పరశివానంద భారతీస్వామి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** భారతీయ ఆధ్యాత్మిక చింతన విశ్వ మానవాళి శ్రేయస్సు కు ఉపయోగ పడే విధంగా గ్రంథాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని సంస్కృత అకాడమీ డైరెక్టర్ పెన్న మధుసూదన్ అన్నారు. విశ్వా వసు నామ సంవత్సర తెలుగు ఉగాది సందర్భంగా నోరి నరసింహశాస్త్రి చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ఆధ్యాత్మిక గ్రంథాలు ఆవిష్కరణ కార్యక్రమం ఆహ్వాన సంఘం సభ్యులు నోరి శివసేనాని, నోరి శివకుమార్, నోరి కల్యాణసుందర్, వేపా సూర్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో జరిగింది. నోరి నరసింహశాస్త్రి చారిటబుల్‌ట్రస్ట్ అధినేత బ్రహ్మశ్రీ నోరి సుబ్రహ్మణశాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వనదుర్గామహా విద్యాపంచశతీ, డాక్టర్ వారణాసి వేంకటేశ్వర్లు కళ్యాణనంద భారతీ మహాస్వామి విరచితమ్ తెలుగు అనువాద వ్యాఖ్యానం, డాక్టర్ నోరి శివసేనాని డాక్టర్ వారణాసి వేంకటేశ్వర్లు కళ్యాణనంద భారతీ మహాస్వామి విరచితమ్ తెలుగు అనువాద వ్యాఖ్యానం 'సౌభాగ్య భాస్కర కశ్మలమ్' గ్రంథాలను ఆవిష్కరించగా ఈ గ్రంథాల పరిచయాన్ని మున్నంగి వేంకటరాయశర్మ, డాక్టర్ వారణాసి వేంకటేశ్వర్లు, డాక్టర్ నోరి శివసేనాని నిర్వహించారు. శ్రీశృంగేరి విరూపాక్ష పీఠాధిపతులు(గుంటూరు) జగద్గురు గంభీరానంద భారతీమహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆశీ: ప్రసంగాన్ని శృంగేరి విరూపాక్ష పీఠం ఉత్తరాధికారి పరశివానంద భారతీస్వామి నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా శ్రీదేవీపీఠం(నర్సీపట్నం) హంస శివానంద భారతీ స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళ్యానంద భారతీ మహాస్వామివారి ఆస్థానం నోరి నరసింహశాస్త్రికి కవిసమ్రాట్ బిరుదును ప్రదానం చేసి గౌరవించారు. డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పిఎంకె.గాంధీ వ్యవహరించారు.

# అలరించిన పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు



శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక పద్యనాటకంలో ఒక దృశ్యం

**నాంపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీరామకృష్ణా నాట్యమండలి నిర్వహణలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రులు, శ్రీ సీతారామకచంద్రస్వామి తిరుకళ్యాణ మహోత్సవాల సందర్భంగా శ్రీకృష్ణరాయబారం, శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక పద్యనాటకాలు అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడి అశేష ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. దైవభక్తియే ప్రధానాంశంగా ప్రదర్శింపబడిన ఈ నాటకాల్లో శ్రీకృష్ణుడుగా జొన్నలగడ్డ జగన్మోహనరావు, నారదుడుగా కె.గణేష్‌కుమార్, వసంతకునిగా మల్లాది భాస్కర్, సత్యభామగా సురభి రామలక్ష్మి, రుక్మిణిగా గంధం రాజేశ్వరి, నళినిగా హారిక తదితరులు ఆయా పాత్రల్లో రసవత్తరంగా నటించి ప్రశంసలందుకున్నారు. చివరిగా అతిథుల చేతులమీదుగా రామలక్ష్మికి కళాసేవక్, భాస్కర్‌కు రంగస్థల సేవక్ అవార్డులతో, ఆలయ అర్చక స్వాములను ఘనంగా సత్కరించి యావత్ నటీనటులను ఎంతగానో అభినందించారు.

## కొండపాక పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించిన ఎండీ అశోక్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** హైదరాబాద్‌కి నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టులో భాగమైన కొండపాక పంపింగ్ స్టేషన్‌ను జలమండలి ఎండి అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరానికి నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాడు. పంపింగ్ మరే విషయాలైనా కూడా అంతరాలు కాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముర్మూర్ వద్ద ఇన్ లెట్ నుంచి నగరానికి సరఫరా ట్రాన్స్మిషన్ తదితర వివరాలకు సంబంధించిన ఆన్లైన్ మానిటరింగ్ సిస్టమ్(స్కాడా)ను వంద శాతం వినియోగం కోసం ప్రణాళికలు రూపొందించి సమర్పించాలని ఆదేశించించారు. అలాగే ఎల్లంపల్లి నుంచి నగరానికి సరఫరా చేసే ప్రతి చుక్కా లెక్కించడానికి ఫ్లో మీటర్ ఏర్పాటు చేసి ఆ వివరాలు ప్రధాన కార్యాలయంలో పర్యవేక్షించేందుకు మీటరింగ్ వ్యవస్థ కూడా ఆటోమేషన్ చేయమని అధికారులకు సూచించారు. అలాగే ఏదైనా అత్యవసర సమయంలో పంపులు రిపేర్లు గానీ కాలిపోయిన సందర్భంగా నీటి సరఫరా ఆటంకం కాకుండా స్టాండ్ బై మోటార్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే పంపింగ్ స్టేషన్ పరిసరాలలో గార్డెన్, సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎండి వెంట ట్రాన్స్మిషన్ జిఎం రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రవీణ్‌కుమార్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

-డిబిపి అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న వడ్డమూరి కృష్ణస్వరూప్

**సైఫాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** క్రైస్తవ ప్రచారకులు పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై న్యాయవిచారణ జరిపించాలని, రీ పోస్టుమార్టం చేయాలని దళిత బహుజన పార్టీ రాష్ట్ర తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం సమీపాన అతని మృత దేహం మార్చి 24వ తేదీన పోలీసులు స్వాదీనం చేసుకున్నారని, పోస్టుమార్టం కూడా సక్రమంగా నిర్వహించలేదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్‌ది రోడ్డు ప్రమాదం కాదని, ముమ్మాటికి ముందస్తు ప్రణాళికతో ఉద్దేశపరంగా చేసిన హత్యని ఆరోపించారు. ప్రవీణ్‌ను విజయవాడలో హంతకులు కిడ్నాప్ చేసి అత్యంత కిరాతకంగా చంపి రాజానగర్ సమీపంలో రోడ్డు ప్రక్కనే హంతకులు పడేశారని ఆయన చెప్పారు. ఈ హత్య వెనుక కాషాయి సంఘ్ పరివార్ సంస్థలకు చెందిన మతోన్మాద శక్తులు, కేంద్ర మంత్రులు, ఎపి రాష్ట్రానికి చెందిన ఎంపిలు, ప్రభుత్వంలోని కొంత మంది హిందూ మత స్వామిజీల హస్తం ఉందని ఆరోపించారు. ఈ కేసు విచారణను ఎపి ప్రభుత్వం నీరుగార్చుతున్నదని, తక్షణమే తెలంగాణ ప్రభుత్వం ప్రవీణ్ మృతదేహన్ని స్వాదీనం చేసుకుని రీ పోస్ట్‌మార్టం నిర్వహించాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని కోరారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన వచ్చిన తరువాత క్రైస్తవులు, దళితులు, ముస్లింలపై కాషాయి శక్తులు దాడి చేస్తున్నాయని, ఈ జాతులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి, తెలంగాణ రాష్ట్రాలు మరో మణిపూర్‌లాగా చేయడానికి కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే ప్రవీణ్‌కుమార్‌ను హత్యచేయడమేనన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్ పైనుండి దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**ముషీరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ట్యాంక్‌బండ్ పైనుండి తెలుగుతల్లి ఫ్లైఓవర్ దగ్గర క్రిందకు దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ ఎస్ఐ కే.ఎస్.రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మార్చి 30వ తేదీ రాత్రి ట్యాంక్‌బండ్ పై నుండి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికుల నుండి ఫిర్యాదు వచ్చింది. ఫిర్యాదు అందుకున్న దోమలగూడ పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి చూడగా అక్కడ దాదాపు 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. పై నుండి క్రిందకు పడటంతో తలకు బలమైన గాయాలవటంతో, ఆవ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి అదే రోజు అర్ధరాత్రి మరణించాడని, ఆవ్యక్తి ఎవరు, ఎక్కడ నుండి వచ్చాడు అనే విషయాలపై విచారించినా ఫలితం లేకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తి గా కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆ వ్యక్తికి సంబంధీకులు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**అల్వాల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి సిఎంఆర్ఎఫ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అల్వాల్‌కు చెందిన రమేష్ కుమార్‌కు 60వేలు సిఎంఆర్ఎఫ్‌కు చెక్కును ఎమ్మెల్యే అందించారు. అనారోగ్యానికి గురైన వారికి అండగా నిలుస్తామని ప్రభుత్వం పరంగా అందాల్సిన లబ్ధి పొందడానికి అందుబాటులో ఉంటానని మర్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్ ఇతరులు పాల్గొన్నారు.

## వరసిద్ధి ఆలయానికి విరాళం

**అల్వాల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** హిందూ ధార్మిక సంస్థల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని బిజెవైఎం జాతీయ కోశాధికారి సాయి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మచ్చబొల్లారం శ్రీ వరసిద్ధి మహా గణపతి ఆలయానికి 50వేలు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపేణా చేశారు. పురాతనమైన వందలాది ఆలయాలకు పూర్వ వైభవం తీసుకుని వచ్చే అంశంలో టీమ్ సాయి సభ్యులు నిరంతరం శ్రమిస్తారని పేర్కొన్నారు.

## హెచ్‌సియూ సమస్యపై హైడ్రా మౌనం ఎందుకు?

**-ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్**

**ముషీరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** గత కొద్ది రోజులుగా సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు కబ్జాకు గురవుతూ గొడవలు జరుగుతూ ఉంటే హైడ్రా ఎందుకు మౌనంగా ఉందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ చెరువులు కాపాడుతామని ప్రతిజ్ఞ బూనిన హైడ్రా రంగనాథ్ కోట్లాది రూపాయల విలువైన 400 ఎకరాలలో ఉన్న అడవితో పాటు మూడు చెరువులు, పీకాక్ లేక్, బఫెల్లో లేక్, క్రేన్ లేక్ లను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. అనేక రకాల జంతువులకు, పక్షులకు నిలయమైన ఈ భూములపై ప్రభుత్వం భేషజాలకు పోకుండా తక్షణం హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల నాయకులతో, అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటుచేసి, చర్చించి, ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. కాంక్రీట్ నగరంగా మారిపోతున్న హైదరాబాద్ మహానగరంలో ఆక్సిజన్ అందిస్తున్న పెద్ద పార్కును నష్టపరచ కుండా, ప్రభుత్వం వేల ఎకరాలలో నిర్మించదలచిన ఫ్యూచర్‌సిటీలో ఈఐటీ హబ్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. హెచ్‌సియూ భూ ములను ఆక్రమిస్తామని, నిర్మాణం చేస్తామని ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

## బిజెవైఎం, ఎబివిపి నేతల అరెస్టు



హెచ్‌సియూ భూముల కోసం ఉద్యమించిన బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి ఆర్.ప్రవీణ్‌కుమార్ తదితరులును పోలీసులు అరెస్టు చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

సెంట్రల్ యూనివర్సిటీ భూములు కాపాడుకుందాం హైదరాబాద్ నగరాన్ని రక్షించుకుందాం,కమిషన్లకు అలవాటు పడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో గల 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మకాని పెట్టడాని వెంటనే నిలిపివేయాలని అదేవిధంగా నిన్న రాత్రి విద్యార్థుల పైన జరిగిన దాడికి నిరసనగా సెంట్రల్ యూనివర్సిటీ భూముల వద్దకు బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి ఆర్.ప్రవీణ్‌కుమార్‌తో పాటు యూత్ నేతలు, ఎబివిపి విద్యార్థి నేతలతో కలిసి వెళ్తా ఉంటే అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**ఆనాథ చిన్నారులకు అండగా ఉంటాం : చైర్మన్ సత్యనారాయణ**

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

నిరుపేదలు, ఆనాథ చిన్నారులకు అండగా ఉంటూ సేవలందిస్తున్నట్లు సత్యం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్యనారాయణ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న పేద,ఆనాథ చిన్నారులకు ఉగాది ప్రత్యేక పచ్చడితో పాటు మజ్జిగ, నీటి ఫ్యాకెట్లను సత్యం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.హనీవెల్ టెక్నాలజీ సొల్యూషన్స్,ఎక్స్‌ఫోర్ట్ కంప్లైయన్స్ లాజిస్టిక్స్ మేనేజర్ బిక్కన్నవర్ వినోద్ హజరై ఈ సేవా వితరణ కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. సేవాభావంతో గత కొన్నేళ్లుగా తమ వంతుగా సమాజానికిసేవ చేయటం,ఆనాథలకు, పేదచిన్నారులకు ఉచితంగా నోట్‌పుస్తకాల పంపిణీ,అన్నదాన వితరణ వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది పేద, అనాథ బాలబాలికలు బాగా చదువుకోవాలని, అభివృద్ధిలోకి రావాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఎప్పుడూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఇంచార్జిలు అరవింద్, రమాదేవి, శ్రీధర్, ట్రస్టు సభ్యులు వసంత్,సుప్రజ,ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## హెచ్‌సియూ భూముల వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి : వనం సుధాకర్

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను సమీకరించే క్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సీటీలోని 4వందల ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేసే ప్రయత్నించటం,ఆందోళనలు చేస్తున్న విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేయటం దారుణమని ఎంసీపీఐ (యు)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం యూనివర్సీటీ భూములను వేలం వేసే ఆలోచనను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హెచ్‌సీయూసీ భూముల వ్యవహారంపై శేరిలింగంపల్లి కి చెందిన ఎంసీపీఐ(యు)నాయకులు మంగళవారం స్పందించారు. హెచ్‌సీయులోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏప్రిల్ 8 నుంచి 15 వతేది వరకు వేలం వేయనుందని, గత ప్రభుత్వం మాదిరిగానే ప్రభుత్వ భూములను వేలం వేస్తూ ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు ధారాదత్తం చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సీటి బూములను వేలం వేయకూడదని, విద్యాసముదాయాల అభివృద్ధి కోసం ఆ భూములను ఉపయోగించాలని యంసీపీఐ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పోలీసులు విద్యార్థులపై జరిపిన లాఠీ చార్జ్,అక్రమ అరెస్టులు,భయభ్రాంతులకు గురిచేయటం లాంటివి విరమించుకోవాలన్నారు.ప్రజా ప్రయోజనాల అర్థం కాపాడా ల్సిన ప్రభుత్వం భూములను కార్పొరేట్ పెట్టుబడిదారి సంస్థల కు, వ్యక్తులకు ధారాదత్తం చేసి గత ప్రభుత్వాల వలే ప్రజావ్య తిరేక విధానాలను అవలంబిస్తే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని వనం సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పేదల పాలిట వరం... సన్నబియ్యం పథకం..



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న సతీష్ రెడ్డి



సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి



బియ్యం పంపిణీ చేస్తున్న జితేందర్‌నాథ్



నల్లగండ్లలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కేంద్రం ప్రారంభించిన జగదీశ్వర్‌గౌడ్



ఖానాపూర్‌లో సన్నబియ్యంను అర్హులకు అందజేస్తున్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ రామేశ్వరం నర్సిహ్మాలు.



లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందజేస్తున్న కప్పర సాయికిరణ్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ డివిజన్‌లో...**

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యాన్ని సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా పౌష్టిక విలువలు కలిగిన సన్న బియ్యం పంపిణీని రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం అభినందనీయమని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి సూచన మేరకు, మంగళవారం కూకట్పల్లి నియోజకవర్గంలోని కెపిహెచ్బి కాలనీ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండారగల్ల సంజీవ రావు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్, బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, రేష్మ, యమునా, దేవ సహాయం రవి, కొమ్ము బాబు, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**నిజాంపేట్ పరిధిలో...**

**నిజాంపేట్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబ కడుపునింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణి చేస్తుందని పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం నుండి సన్నబియ్యం పంపిణీ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి విచ్చేసి గ్రామపంచాయతీ రేషన్ షాపు నందు మొదలై, రాజీవ్ గృహకల్ప వద్ద రెండు చోట్ల, ఎస్సీ కాలనీ అంబేద్కర్ స్టాచ్యూ వద్ద అనంతరం ఫేస్ 1 రేషన్ షాప్ వద్దకు వచ్చి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ బియ్యం అందేలా చూడమని డీలర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ ఎమ్ సి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి, డివిజన్‌ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, కె ఎస్ ఆర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**మచ్చబొల్లారంలో**

**అల్వాల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** సన్న బియ్యం పంపిణీని మంగళవారం మచ్చబొల్లారంలో స్థానిక కార్పొరేటర్ జితేందర్‌నాథ్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మచ్చబొల్లాం, అల్వాల్, వెంకటాపురం డివిజన్లలో స్థానిక కాంగ్రెస్ నేతలు రేషన్ దుకాణాలు వద్ద బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. అల్వాల్ డివిజన్ పరిధిలో నేతలు లక్ష్మీకాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి, సిఎల్ యాదగిరి, ఉదయ్ కుమార్, రాజసింహారెడ్డి, నాగేశ్వర రావులు బియ్యం పంపిణీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని వారు తెలిపారు.

**నల్లగండ్ల గ్రామంలో...**

**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** దేశంలోనే సన్న బియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం నల్లగండ్ల గ్రామంలోని రేషన్ దుకాణంలో జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని పేదలందరికీ ఆహార భద్రత కల్పించటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో దాదాపు 84శాతం మంది పేదలకు ప్రజా ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందించబోతుందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్,కుమార్, ముకుంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గండిపేట మండలంలో...**

**నార్సింగి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** పేదల పాలిట వరం... సన్నబియ్యం పకతం... అని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళారం గండిపేట మండలం ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలలో మాజీ సర్పంచ్‌లు రామేశ్వరం నర్సిహ్మా, గండయ్య ముదిరాజ్‌లతో కలిసి మల్లేష్ ముదిరాజ్ అర్హులకు సన్నబియ్యంను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి సహకార సంఘం చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శిశుపాల్‌సింగ్, శేఖర్, అరుణ్, లక్ష్మణ్‌రెడ్డి, తారాసింగ్, విశ్వనాథం, సుధాకర్ యాదవ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**మల్లాపూర్‌లో**

**నాచారం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ప్రజా పాలనలో సన్న బియ్యం అందజేయడంతో ఎంతో మందికి లబ్ధిచేకూరుతుందని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగోని ఉమేష్ గౌడ్, సుదర్శన్, దంతురి రాజు గౌడ్, నెమలి అనిల్, కోయగూర బాలరాజ్, జెమిలా బేగం,ప్రభాకర్ రెడ్డి, పర్వతాలు, మనోహర్, సురేష్ గౌడ్, కిట్టు, రాజేష్, శ్రీకాంత్ రెడ్డి,జానీ భాయ్, జాఫర్, శైలజా, సోనీ, లావణ్య, లక్ష్మి, సునీత, రాహుల్, గణేష్, ఫిరోజ్, రవి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లు కోసం తెలంగాణ తరహాలో బిసి ఉద్యమం

**-ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్**

**హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ల కల్పించిన కేంద్ర ప్రభుత్వం అదే తరహాలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరతరాలుగా అన్యాయానికి గురువుతున్న అణగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర శాసన సభ చేసిన తీర్మానాన్ని ఈ పార్లమెంట్ సమావేశాలల్లో ఆమోదింప జేయాల్సిన బాధ్యత రాష్ట్ర బిజెపి నాయకులదేనని, లేనిపక్షంలో వారిని రాష్ట్రంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్ లో బిసి రిజర్వేషన్లు చేర్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని ఆయన కోరారు. బిజెపి రాష్ట్రంలో బిసి బిల్లుకు మద్దతు ఇవ్వగా, ముస్లిం రిజర్వేషన్ల సాకుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ద్వంద విధానాలు అవలంబిస్తోందన్నారు. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత కేంద్రమంతులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతోపాటు 6మంది ఎంపిలదేనని తెలిపారు.50 రిజర్వేషన్ల సీలింగ్ కాలం చెల్లిందని, అగ్రవర్ణ రిజర్వేషన్లకు ఒక న్యాయం, బిసి రిజర్వేషన్లకు ఇంకొక న్యాయమా? అని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్ లో బిసి బిల్లును ఆమోదింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని, బిజెపి అగ్రనాయకులను ఒప్పించే బాధ్యతను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపి ఆర్ కృష్ణయ్యలు తీసుకోవాలన్నారు. కుల గణన విషయంలో మోసం చేసినట్లు 42 శాతం బిసి రిజర్వేషన్ కూడా మోసం చేస్తే సహించేదిలేదన్నారు. 42 శాతం బిసి బిల్లును పార్లమెంట్ ఆమోదించిన అనంతరమే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణాలో అడుగుపెట్టాలని, లేనట్లయితే ప్రజలు వారిని తరిమితరిమి కొడతారని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సమయంలో బిసి సిఎం అంటూ నినాదాలిచ్చిన బిజెపి ఇప్పుడు మాత్రం బిసిలకు సర్పంచ్ సీట్లు కూడా దక్కకుండా చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బిఆర్ఎస్ శ్రేణులు ముందుండాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్



ప్రసంగిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** .ప్రజా సమస్యల పరిష్కరించడంలో టిఆర్ఎస్ పేర్లు ముందుండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముటాగోపాల్ అన్నారు. మంగళవారం గాంధీ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ఈ 27న వరంగల్లో నిర్వహించబోయే పార్టీ ప్లీనరీ గురించి సదస్సు గురించి చర్చించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో టిఆర్ఎస్ నాయకులు టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని అన్నారు. పార్టీపై నమ్మకం కలియ విధంగా పార్టీపై మరింత ప్రజల్లో నమ్మకం కలిగే విధంగా పనిచేయాలని సూచించారు. 27న జరిగే టిఆర్ఎస్ పార్టీ ప్లీనరీ సమావేశం విజయవంతం చేయడానికి అన్ని విధాల కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ ,రాంనగర్, కవాడిగూడ ముషీరాబాద్ బోలాపూర్, అడిక్మెంట్ డివిజన్ల పార్టీ అధ్యక్షులు రాకేష్ కుమార్, శంకర్ ముదిరాజ్, వల్లాల శ్యామ్ యాదవ్, వై శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, దామోదర్ రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌సియు భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలి**

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన 400 ఎకరాల భూమిని ఆ విశ్వవిద్యాలయానికి అప్పగించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీకి చెందిన భూమిని ఎలాగైనా చీజిక్కించుకోవాలని కుట్రలు పన్నుతోందనీ, ఆ విధంగా భూములు అమ్మి సొమ్ము చేసుకుందామని చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి ప్రభుత్వం ఈ విధంగా చర్యలకు ఉపక్రమించడం అన్నారు. శత్రువులపై యుద్ధానికి వెళ్ళినట్లు ప్రభుత్వం బుల్డోజర్ల సహాయంతో దండెత్తడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

## క్రీడలకు వైఎంసిఎ పుట్టినిల్లులాంటిది - మాజీ మంత్రి బాబుమోహన్

**కంటోన్మెంట్,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వైఎంసీఏ నుంచి ఒలింపిక్స్ వెళ్లిన క్రీడా కారులు ఎంతో మంది ఉన్నారని, అందు వల్ల క్రీడలకు వైఎంసీఏ పుట్టినిల్లు లాంటిదని మాజీ మంత్రి, ప్రముఖ నటుడు బాబు మోహన్ తెలిపారు. సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మే 31 వరకు జరగనున్న సమ్మర్ క్యాంప్ బ్రోచర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షుడు దయాకర్ డెనియల్ మాట్లాడుతూ యువత, విద్యార్థుల్లో క్రీడల్లో అశక్తి పెంచేందుకు వైఎంసీఏ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు కార్యక్రమంలో వైఎంసీఏ కార్యదర్శి లెనార్డ్ ప్రతినిధులు కళ్యాణ్ సాల్మన్‌రాజు, రవిబాబు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో మావోయిస్టు రేణుక కుటుంబ సభ్యుల నివాసం

**అల్వాల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ కీలక మహిళా నేత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, సెంట్రల్ రీజినల్ బ్యూరో ప్రెస్‌టీం ఇన్‌చార్జి గుమ్ముడవెల్లి రేణుక తల్లిదండ్రులు అల్వాల్‌లో నివాసం ఉంటున్నారు. అల్వాల్ వెంకటాపురం రామచంద్రయ్య కాలనీలో తండ్రి సోమయ్య,తల్లి విజయమ్మ, సోదరుడు రాజశేఖర్‌లు స్థానికంగా సుపరిచితులు. కూతురు రేణుక సోమవారం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిందన్న వార్తను తెలుసుకుని వారు శోకసంద్రలో మునిగి పోయారు. పది సంవత్సరాలు నుంచి వీరు అల్వాల్‌లో నివాసం ఉంటున్నారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో రేణుక పార్థీవ దేహం కోసం కుటుంబ సభ్యులు మంగళవారం తెల్లవారు జామున ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు. 2010 వరకు కూతురికి సంబంధించిన సమాచారం ఉండేదని తల్లి విజయమ్మ తెలిపారు. ఉత్తరాలు ద్వారా బాగోగులను చెప్పేదన్నారు. పద్నాలుగా సంవత్సరాలుగా రేణుకతో సంబందాలు పూర్తిగా తెగిపోయాయని సోదరుడు రాజశేఖర్ పేర్కొన్నారు. రేణుక ఎన్‌కౌంటర్ తరువాత ఆమె తల్లిదండ్రులు తమ ప్రాంతంలో నివాసం ఉంటున్నారనేది స్థానికులకు తెలిసింది.

## కవితా కళానిధి ప్రఖ్యాతకవి కపిలవాయి లింగమూర్తి



పురస్కారగ్రహీతలతో వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, అశోక్‌బాబు తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ప్రఖ్యాత కవి, రచయిత, సాహితీవేత్త, పరిశోధకుడు కపిలవాయి లింగమూర్తి కవితా కళానిధి అని వక్తలు ప్రశంసించారు. ఆయన నలుగురు ముఖ్యమంత్రుల చేతులమీదుగా అవార్డులు పొందిన ఏకైక వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో పలువురు ప్రముఖులకు కపిలవాయి లింగమూర్తి మీనాక్షమ్మల పురస్కారాల ప్రదానోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా జాతీయ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి కవి రచయిత దర్శకుడు డా. కల్లోజు కనకాచారికి ఈ పురస్కారం అందజేశారు. అనంతరం కపిలవాయి కిషోర్‌బాబు భార్గవిదేవిల పురస్కారాలను ప్రముఖ కవులు వల్లభాపురం జనార్దన్, వి.సుబ్బయ్యకు అందజేశారు. ఓయు తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకరశర్మ సభాధ్యక్షతన వహించగా, పి.వెంకటదాసు, ఎస్వీ రఘువీర్ ప్రతాప్, డా. చందోజరావుల నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనంలో 18మంది ప్రముఖ కవులు తమ తమ కవితాగానం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో సాహిత్యపీఠం ఉపాధ్యక్షుడు కె.కృష్ణమూర్తి, కార్యదర్శి కపిలవాయి అశోక్‌బాబు పాల్గొన్నారు.

## బిజెపి నేతల ముందస్తు అరెస్టులు



బీజేపీ నేతలను ముందస్తు అరెస్టు చేసిన అల్లాపూర్ పోలీసులు.

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం గత కొద్ది రోజులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో వందల జేసీబీలతో చెట్లను నరికి భూములను అమ్మే ప్రయత్నం చేస్తుందని యూనివర్సిటీలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలను సైతం పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని భూములను ఇలా అమ్మేస్తే భవిష్యత్‌లో ఏమాత్రం భూములు మిగలవన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక భూములను తాకట్టు పెట్టిందని రేవంత్‌రెడ్డి సర్కార్ భూములను అమ్మే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ భూములను విద్యార్థులకు అన్ని రకాలుగా ఉపయోగంలోకి తెస్తామని గతంలో రేవంత్‌రెడ్డి చెప్పారని కాని ఇప్పుడు అవేభూములను అమ్మే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూములను అమ్మకుండా భారతీయ జనతాపార్టీ విద్యార్థుల తరపున పోరాడుతుందని పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద్‌నగర్‌లో ఉండే సెంట్రల్ జిల్లా కార్యదర్శి పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్‌తో పాటు జిల్లా అధికార ప్రతినిధి అమ్రేష్ రాజుని అల్లాపూర్ పోలీసులు అరెస్టు చేశారు.

## వరకట్నం వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య

**చార్మినార్,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** వరకట్నం వేధింపులు భరించలేక ఓ గృహిణి యాసిడి తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ నరేందర్ కథనం ప్రకారం.....పాతబస్తీ తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ రహీం వివాహం 2021వ సంవత్సరం నవంబరు నెలలో ఫిర్దోస్ బేగంతో జరిగింది.వివాహం జరిగినప్పటి నుంచి భర్తతో పాటు అత్తింటి వారు అదనపు కట్నం తేవాలని ఫిర్దోస్ బేగంను వేధిస్తున్నారు. అత్తింటి వేధింపులు భరించలేక ఫిర్దోస్ బేగం ఈ నెల 30వ తేదీన ఇంట్లో యాసిడ్ తాగింది.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్దోస్ బేగం మంగళవారం మృతిచెందింది.పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ కేసును భవానీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి హౌస్ అరెస్ట్



రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డిని అరెస్ట్ చేసిన చిత్రం

**మైలార్‌దేవ్‌పల్లి,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డిని హెచ్‌సియు భూములను చదును చేయకుండ అడ్డుకుంటారని ముందస్తుగా మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అరుదైన జంతు వృక్ష సంపద కలిగిన అందమైన ప్రాంతాన్ని జెసిబిలు నలు వైపుల చుట్టుముట్టి అడవిని నామ రూపం లేకుండ చేస్తున్నాయని తెలిపారు. అడవిని మైదానంగా మార్చి కార్పొరేటర్ కంపెనీలకు వేలం ద్వారా కట్ట బెట్టేందుకు ముఖ్యమంత్రి అత్యుత్సాహం ఎందుకు ప్రదర్శిస్తున్నారని తెలియజేశారు.ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పెద్ద ఎత్తున హెచ్‌సియు భూములను చదువును చేయకుండ అడ్డుకోవటానికి పోరాటం చేస్తామని,ఈ విషయంలో బిజెపి తగిన గుణపాఠం చెప్పనున్నదని ఆయన తెలిపారు.

## మద్యం తాగి వాటర్ ట్యాంకర్ నడుపుతున్న డ్రైవర్ పట్టివేత



వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న కాచిగూడ ట్రాఫిక్ ఎస్ఐ అనిల్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** మద్యం సేవించి వాటర్ ట్యాంకర్ నడుతున్న డ్రైవర్.. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డాడు. మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాటర్ ట్యాంకర్ నడుతున్న ప్రతీక్ సోను కాంబ్లేను పోలీసులు డిడి చెకింగ్ చేయగా ఆల్కహాల్ 205గా నమోదు అయింది. మంగళవారం బర్కత్‌పురలో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాటర్ ట్యాంకర్ డ్రైవర్ పట్టుబడ్డాడు.ఈ సందర్భంగా ఏఎస్సై అనిల్‌గౌడ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ట్రాఫిక్ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి లేకుండా వాహనాలు నడపవద్దని, ప్రమాదం లేకుండా సురక్షితంగా వాటర్ ట్యాంకర్లు నడపాలని ఆయన పేర్కొన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లా డుతూ వాహనం నడపరాదన్నారు. ద్విచక్ర వాహ నంపై ముగ్గురు వెళ్లరాదని, ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద, సిగ్నల్స్‌ల వద్ద నిబంధనలను అతిక్రమించరాదని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనం నడిపేవారిపై చట్టపరంగా జరిమానాలు విధించనున్నట్లు హెచ్చరించారు.

## జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య



కార్యక్రమంలో పాల్గొన్న పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు జగదాంబ, స్మారక సంస్థ చైర్‌పర్సన్ రామారావు, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ యాదవ్.

**చిక్కడపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య అని వక్తలు కీర్తించారు. మంగళవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యానగర్ లో 104వ జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవ మహాసభ జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు జగదాంబ, పింగళి వెంకయ్య స్మారక సంస్థ చైర్పర్సన్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల దేశభక్తి గేయాలు సంస్కృతి కార్యక్రమాలు కార్యక్రమానికి హైలైట్ గా నిలిచాయి. దేశభక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం జాతీయ జెండాలను విద్యార్థులు చేతిన పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ యాదవ్. టిపిసిసి సెక్రెటరీ కేశవ్, బిజెపి తెలంగాణ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రొయ్యూరి శేష సాయి. లయన్స్ క్లబ్ మెంబర్ మిలియన్ బాబురావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు జాతీయ భక్తుని పెంపొందించే వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వాగ్దేవి మ్యూజిక్ అకాడమీ సీతారత్నం జాతీయ గీతం పై ప్రత్యేక గీతాన్ని ఆలపించగా కార్యక్రమంలో ప్రసునాంబ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

**NOTICE**
**IN THE COURT OF HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE - CUM - V ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT LB NAGAR**
**O.S. NO. 249 OF 2025**

1. K. Kavitha, W/o. Late Sri. Ram Mohan Gorantla, Aged about 56 years, Occ: Private employee.
2. Gorantla Kushal Karthik, S/o. Late Sri. Ram Mohan Gorantla, Aged about 13 years, Occ.: Minor.
3. Gorantla Yuvan Karthik, S/o. Late Sri. Ram Mohan Gorantla, Aged about 12 years, Occ. Minor.

Plaintiffs No. 2 & 3 being Minors, are represented by their Mother & Natural Guardian i.e. Plaintiff No.1
All are R/o. # 9-1-34-1 to 9-1-34-5, Rank One Towers, Flat No. 205, Bapunagar Main Road, Opp. Alankar Cinema Langer House Hyderabad Telangana - 500008.
..Plaintiffs

AND

1. The Tahsildar, Ghatkesar
2. All Concerned

...Defendants

To
All concerned
WHEREAS, The Plaintiffs have instituted a suit for declaration of legal heirs against Defendant No.1 and all concerned as Defendant no 2, and if any interested party is hereby summoned for appearance in this court by in person or by a pleader duly instructed and able to answer all the material questions relating to the suit on the date of the suit and the same is posted on 15-04-2025 for appearance at 10:30 A.M in the above court. Take notice that in default of your appearance on the said day the matter will be determined in your absence. Hence this Notice.

(BY ORDER OF THE COURT)
Sd/- K. Keerthana
# 16-11-20/6/7/B, 1st Floor, behind Karachi Bakery, Malakpet, Hyderabad - 500036
COUNSEL FOR PLAINTIFF

## అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్‌లో నాలుగు పతకాలు సాధించిన చర్ల జూహిత్



రోలర్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన చలం చర్ల జూహిత్

**కంటోన్మెంట్,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన డాక్టర్ సునీల్ కుమార్, సంధ్యారాణిల కు చెందిన చలం చర్ల జూహిత్‌కు ఓపెన్ ఛాంపియన్‌షిప్ అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్‌లో మూడు స్వర్ణ పతకాలు, 1 రజత పతకం సాధించి రా ష్ట్రానికి,దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారు. తైవాన్‌లోని జుబే నగరంలో గత నెల 20 నుంచి 30 వరకు జరిగిన జూనియర్ మెన్ కెటగిరిలో చలం చర్ల జూహిత్ సోలో డ్యాన్స్, పేర్ స్కేటింగ్, పేర్, క్వాడ్రెట్ విభాగంలో 3 స్వర్ణ పతకాలు, 1 రజతం సాధించాడు. ఈ పోటీల్లో 8 దేశాలతో జూహిత్ తలబడి నాలుగు పతకాలును సాధించాడు. జూబ్లీహిల్స్‌లోని పేజ్ జూనియర్ కళాశాలలో ఎంపిసీ పస్ట్ ఇయర్ పూర్తి చేసిన జూహిత్ 2022లో అహ్మదాబాద్‌లో నేషనల్ గేమ్స్‌లో పేర్ డ్యాన్స్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. అదే విధంగా 2023లో చైనాలో జరిగిన యేషియన్ ఛాంపియన్‌షిప్‌లో సోలో డ్యాన్స్ కెటగిరిలో స్వర్ణం సాధించారు. అతి చిన్న వయసులో జూహిత్ అంతర్జాతీయ స్థాయిలో జరిగిన రోలర్ స్కేటింగ్‌లో పతకానికి సాధిం చినందుకు అతని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అతనికి శిక్షణను ఇచ్చి కోచ్ అర్జున్ అవార్డు గ్రహిత అనూప్ కుమార్ యామ, అమర్‌నాథ్ యామలకు అభినందనలు తెలిపారు.

### జై సంవిధాన్ కార్యక్రమం విజయవంతం చేయాలి : నాగేశ్ యాదవ్



లోహియ నగర్‌లో జై సంవిధాన్ అభియాన్ సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత ఆర్.డి.నాగేశ్ యాదవ్

**అడ్డగుట్ట,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని మోండా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.డి.నాగేశ్ యాదవ్ తెలిపారు. మంగళవారం లోహియ నగర్‌లో ఏర్పాటు చేసిన జై బాపూ, జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చింది జాతిపిత మహాత్మగాంధీ అయితే స్వపరిపాలన కోసం రాజ్యాంగాన్ని అందించింది అంబేద్కర్ అన్నారు. ఏఐసిసి పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు చురుకుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కో-ఆర్డినేటర్ శేఖర్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు చి గ్రబోయిన సంతోష్ యాదవ్, బద్రినాథ్ యాదవ్, వెంకట్ రాజు, మంద సురేశ్, మంద ప్రభాకర్, డి.బాబురావ్ పాల్గొన్నారు.

### 6న ప్రశ్నించే 'గొంతులు-పాలకుల అణిచివేత'పై సదస్సు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ

**సైఫాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రముఖ ప్రజా గాయకుడు, రచయిత గద్దర్‌పై 1997లో ఏప్రిల్ 6వ తేదీన కాల్పులు జరిగిన నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ ఈ నెల 6వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రశ్నించే గొంతులు-పాలకుల అణిచివేత' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని గద్దర్ ఫౌండేషన్ తెలిపింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ, ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జి.వి.సూర్యకిరణ్, ప్రతినిధులు ఆర్. వెంకట్‌రెడ్డి, బెల్లయ్యనాయక్, వి.ఎల్.శంకర్, ఆసా శ్రీరాములు తదితరులు ఈ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సులో ప్రముఖులు వేములపాటి అజయ్‌కుమార్, మీనా కందస్వామి, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, గోరేటి వెంకన్న తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు. గద్దర్ తన ఆటపాటలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, గద్దర్ తన వారసత్వాన్ని కొనసాగించడం కోసం ఆయన జయంతి, వర్థంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గద్దర్ ఒక వ్యక్తి కాదని, ఒక వ్యవస్థ అని ప్రజల కోసం పనిచేసిన గొప్ప వ్యక్తిని, ఆయన ఆలోచన, ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. గద్దర్‌పై కాల్పులు జరిగిన సంఘటనపై విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ సేవలు అమోఘం : ఎమ్మెల్యే తలసాని



శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన మధ్యాహ్న మిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్ ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పేదలకు సేవా చేయాలనే సంకల్పం చాలా గొప్పదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సనత్ నగర్‌లోని బికేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న మిత భోజన పంపిణీ కార్యక్రమం, చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. నేటి నుంచి సుమారు 2 నెలల పాటు ఈ కేంద్రాలను కొనసాగుతాయని నిర్వాహకులు వివరించారు. పలువురికి భోజనం వడ్డించడమే కాకుండా ఎమ్మెల్యే తలసాని కూడా భోజనం చేసి ఎంతో రుచికరంగా,నాణ్యతతో భోజనాన్ని ఉచితంగా అనేక మంది ఆకలి తీరుస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, హన్మంత్ రావ్, సీనియర్ నాయకుడు అశోక్ యాదవ్,డాక్టర్లు సుష్మ, ప్రియాంక, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు దూబే,మాజీ అధ్యక్షులు మాణిక్ రావ్ పటేల్, కౌన్సిల్ సభ్యులు సహదేవ్ గౌడ్, కృష్ణ దేవ్ గౌడ్, క్రిష్ణారెడ్డి, జయప్రసాద్, శంకర్, రామలింగం, అనంతరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గోపిలాల్ చౌహాన్, ఖలీల్, కూతురు నర్సింహా, కట్ట బలరామ్, వనం శ్రీనివాస్, హరిసింగ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి కళలు సాహిత్యం తోడ్పడుతాయి : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



ఉగాది పురస్కారంతో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథరామారెడ్డి సత్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ, గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎల్.సుబ్రహ్మణ్యం, రఘురామ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** సమాజాభివృద్ధికి కళలు, సాహిత్యం ఇతోధికంగా తోడ్పడుతాయన్న తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ భారత దేశం సమైక్యభావన, విభిన్న సంస్కృతుల మేళవింపుతో విరాజిల్లుతోందని, అందులో తెలంగాణ రాష్ట్రం కళల కాణాచిగా ప్రసిద్ధికెక్కిందని అన్నారు. ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య సేవాసంస్థ కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలుగుజాతి నూతన సంవత్సరం శ్రీ విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధరంగాలకు చెందిన ప్రముఖులకు గవర్నరు ఉగాది పురస్కారాలు ప్రదానంచేసి ప్రసంగించారు. కళలు, సాహిత్యం, వైద్య, న్యాయరంగాలకు చెందిన విజ్ఞానవంతులను ఎంపికచేసి కిన్నెర వారిని సత్కరించడం శ్లాఘనీయమని, కిన్నెర నిర్వహిస్తున్న సాహితీ కళా కార్యక్రమాలు ప్రశంసనీయమని కొనియాడారు. ఏపి విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్.సుబ్రహ్మణ్యం అధ్యక్షోపన్యాసంలో భారతీయ సంస్కృతిలో విశిష్ట జీవన విధానానికి ప్రతీకగా ఉగాది పర్వదినం నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఆదర్శప్రాయులుగా నిలిచేందుకు పురస్కార గ్రహీతలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు దేశంలో అన్ని వ్యవస్థల పరితీరు లోపభూయిష్టంగా ఉన్నాయని, ప్రతీరంగంలో యువత ముందుకువచ్చి సన్మార్గంలో నడిపించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. స్వాగతోపన్యాసంలో కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ సంస్థ 48ఏళ్ల ప్రస్థానాన్ని, నిర్వహించిన కార్యక్రమాలను విశదీకరించారు. కిన్నెర శ్రీ విశ్వావసు నామ ఉగాది పురస్కారాలు అందుకున్న ప్రముఖుల్లో ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మోహన్, శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి, ఇంజనీర్ ఎం.వి.రమణారావు, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథరామారెడ్డి రంగస్థల ప్రయోక్త మీగడ రామలింగస్వామి, నాట్యగురువు డా. రమాదేవి, స్వరకర్త పి.వి. సాయిబాబా, సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, హస్త కళల కళాకారిణి కమలాప్రసాద్‌రావు, ఆడిటర్ లోకనాథయ్యలు ఉన్నారు. సభకుముందు ప్రఖ్యాత నాట్యగురువు ఉషాగాయత్రి శిష్యబృందం ప్రదర్శించిన అలిమేలు మంగ చరితం నృత్యరూపకం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది.

## పేదల కడుపు నింపాలన్నదే సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష : సత్యం



తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందజేస్తున్న సత్యం శ్రీరంగం

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని పేదల కడుపు నింపాలన్నా ఉద్దేశంతో ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకం మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గంలో సత్యం శ్రీరంగం ప్రారంభించారు. బాలాజీనగర్, అల్లాపూర్ డివిజన్ లలో డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, ఎండి మొయినుద్దీన్ ఆధ్వర్యంలో పలు రేషన్ షాపలలో తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలకు సన్న బియ్యం పథకం కింద లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పేదలు కూడా సంపన్నులతో సమానంగా సన్న బియ్యం తినే విధంగా సన్న బియ్యంను అందించాలనే గొప్ప ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి చేసి ఉగాది పర్వదినాన పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబ కడుపునింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణి చేస్తుంది అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు. సన్న బియ్యం అంటే కేవలం ధనవంతుల తినే ఆహారంగా వుండే, పేదవాడికి అందని ద్రాక్షగా ఉన్న సన్నబియ్యం అన్నం అంటే పేదలు కేవలం పండుగల సమయంలో తినే రోజులు పోయాయి నేడు ప్రతి గృహంలో సన్నబియ్యం ఇది పేదల పక్షం, సంక్షేమ ప్రభుత్వ విజయం అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, వైస్ ఛైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహా యాదవ్, డివిజన్ల మహిళా అధ్యక్షురాళ్లు మారుతీ, భారతమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెపు నాగరాజు, సాధు ప్రతాప్ రెడ్డి, రంగారావు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

### మాదిగలకు నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నేతలు పల్లె కిష్టయ్య, ఏర్పుల పెంటయ్య తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** జనాభా దామాషా ప్రకారం మాదిగలకు నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలని ఎంఆర్పిఎస్ నేతలు వల్లె కిష్టయ్య, ఏర్పుల పెంటయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షలకుపైగా మాదిగలుంటే ఒక్క మంత్రి పదవి కూడా లేదని, అదే 15లక్షలున్న మాలలకు డిప్యూటీ సిఎం, అసెంబ్లీ స్పీకర్ పదవులు ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా మాదిగలకు అన్యాయం జరిగిందన్నారు. మాదిగలకు మంత్రివర్గ విస్తరణలో న్యాయంచేయకపోతే ఆందోళనలు, నిరసనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నేతలు చంద్రకిరణ్, ఏర్పుల భాస్కర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### మల్లేశంగౌడ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి -సినీహీరో తల్వార్ సుమన్



మల్లేశంగౌడ్‌ను సన్మానిస్తున్న హీరో సుమన్, పంజాల శ్రావణ్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** సమాజానికి విశిష్ట సేవలు అందించిన ప్రముఖ సంఘ సంస్కర్త, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చింతల మల్లేశంగౌడ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సినీహీరో సుమన్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఆయనతోపాటు వివిధ రాజకీయ ప్రముఖులు ఇటీవల జర్మనీ పీస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న చింతల మల్లేశంగౌడ్ కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ సొంత సామాజిక వర్గం మీద ఎనలేని ప్రేమతో విద్య, వైద్య వంటి అనేక సహాయ కార్యక్రమాలను మల్లేశం గౌడ్ చేశారని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను సుమారు 50కిపైగా రాష్ట్రంలో ప్రదానం చేసి, శ్రీశైలంలో, షిర్డీలో గౌడ సత్ర నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఈసమావేశంలో గౌడ సంఘం నేతలు పంజాల శ్రవణ్, నాగరాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

### టిడిసిఎ వన్డే సిరీస్ అమెరికా కైవసం

-త్వరలో అమెరికా, వెస్టిండీస్ టూర్లకు టిడిసిఎ జట్లు

-వ్యవస్థాపక ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) నిర్వహించిన అండర్17 వన్డే సిరీస్ అమెరికా యూత క్రికెట్ అకాడమీ జట్టు కైవసం చేసుకుంది.ఫైనల్లో మ్యాచ్‌లో అమెరికా జట్టు 57 పరుగుల తేడాతో టీడీసీఏ లెవన్‌పై గెలుపొందింది.తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన అమెరికా టీమ్ 49.1 ఓవర్లలో 297కు ఆలౌటైంది. ఛేదనలో టీడీసీఏ 42.5 ఓవర్లలో 240కు ఆలౌటై, పరాజయం పాలైంది. ఫైనల్ అనంతరం టీడీసీఏ వ్యవస్థాపక ఛైర్మన అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అమెరికాలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువ క్రికెటర్లను తెలంగాణ గ్రామీణ క్రికెటర్లతో ఆడేందుకు తీసుకొచ్చిన కొలిపాక అరుణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో అమెరికాతో పాటు వెస్టిండీస్‌కు తెలంగాణ గ్రామీణ క్రికెట్ జట్లను తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన తెలంగాణ గ్రామీణ క్రికెటర్లను టీమిండియాకు ఆడించడమే టీడీసీఏ లక్ష్యమన్నారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు అమెరికా క్రికెటర్ అద్నిత జాంబ్‌కు లభించింది.

### మార్కెట్ నిబంధనలకు లోబడే వ్యాపారాలు నిర్వహించాలి : తలారి మల్లేష్



వ్యాపారులతో మాట్లాడుతున్న ఛైర్మన్ తలారి మల్లేష్

**మెహిదీపట్నం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** మార్కెట్ నిబంధనలకు లోబడి తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తలారి మల్లేష్ వ్యాపారులకు సూచించారు. మార్కెట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలను నిర్వహిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. మంగళవారం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కావాలి చంద్రశేఖర్ తో కలిసి కూరగాయల హోల్ సేల్ మార్కెట్ లో పర్యటించారు. ఈ సందర్భంగా మార్కెట్ లో వ్యాపారులకు తలెత్తుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తలారి మల్లేష్, వైస్ ఛైర్మన్ కావాలి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ.. కూరగాయల హోల్ సేల్ మార్కెట్ లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని గతంలో వ్యాపారులు పాలక మండలి దృష్టికి తీసుకురావడంతో, ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి మార్కెట్ సముదాయాల ముందు మార్కింగ్ వేయడం జరిగిందన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం అవుతుండడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరో రెండు రోజుల్లో టమాట వ్యాపారం జరిగే ప్రదేశంలో కూడా మార్కింగ్ వేస్తామని వివరించారు. మార్కెట్ లోని అన్ని సమస్యలపై దృష్టి పెట్టడం జరిగిందని, దశలవారీగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారుల సమస్యల పరిష్కారానికే మార్కెట్ కు పాలకమండలి, అధికారులు ఉన్నారని గుర్తు చేశారు. వీరి వెంట పాలకమండలి సభ్యులు, మార్కెట్ అధికారులు, వ్యాపారులు ఉన్నారు.

### మానవ హక్కులకు భంగం కలుగకుండా చూడాలి : జంపనప్రతాప్



మానవహక్కుల సోషల్ జస్టిస్ ఉపాధ్యక్షుడు అశోక్‌ను సన్మానిస్తున్న జంపనప్రతాప్, పిట్ల నాగేశ్ తదితరులు

**కంటోన్మెంట్,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా నేషనల్ హ్యూమన్ రైట్స్ వాటి పరిరక్షణకు సోషల్ జస్టీస్ సంస్థ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బిజెపి సీనియర్ నాయకులు పిట్ల నాగేశ్‌లు తెలిపారు. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన ఎన్.అశోక్‌కు జాతీయ మానహక్కులు సామాజిక న్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సందర్బంగా వారు అశోక్‌కు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ ఉద్యమ నాయకులు ప్రభుగుప్త, అరుణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఐలమ్మ విశ్వవిద్యాలయంలో నిలువెత్తు చిత్రపటం ఆవిష్కరణ

**సైఫాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార:** కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయా నికి ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంగా నామకరణ చేసిన నేపథ్యంలో ఆ ధీర మహిళ వీరనారి చాకలి ఐలమ్మ పోరాట జీవితాన్ని ప్రతిబింబించే విధంగా నిలువెత్తు చిత్రపటాన్ని దర్బారు హాల్‌లో ఆవిష్కరిస్తున్నామని రెవల్యూషనరీ ఉమెన్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఆర్‌డబ్ల్యూహెచ్ఓ), అరుణ ఆర్ట్స్ తెలిపాయి. ఈ మేరకు మంగళ వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.హరికాంత్, ఉపాధ్యక్షుడు కె.చరణ్, కార్యదర్శి డాక్టర్ సౌజన్య తదితరులు ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 2వ తేదీన ఉదయం 11 గంటలకు విశ్వవిద్యాలయంలో వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యధ నంజయ, ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు బి.నర్సింగ్‌రావు, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని చెప్పారు. చాకలి ఐలమ్మ పోరాటం యావత్ ప్రపంచానికి స్ఫూర్తిని ఛ్చిందని, భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆహర్నిషలు కృషి చేసిన ఆమె పోరాట స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని పిలు పునిచ్చారు. ఈ సందర్భంగా వారు సిఎం రేవంత్‌రెడ్డి, విసి సూర్యధ నంజయలకు ధన్యవాదాలు వారు తెలిపారు.

## బిజెపి నేతల అరెస్టు



టపచ్చబుత్ర పోలీస్ స్టేషన్‌లో బిజెపి నేతలు.

**మెహిదీపట్నం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం యూనివర్సిటీకి వెళ్తున్న కార్వాన్ నియోజకవర్గ గుడిమల్కాపూర్ డివిజన్ బిజెపి నేతలను టపచపుత్ర పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి గుడి మల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు తాళ్ల రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. గత పాలకులు ప్రభుత్వ భూములను బడా బాబులకు ధారధతం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం యూనివర్సిటీ భూములను వేలం వేయడానికి సిద్ధపడటం సిగ్గుచేటు అన్నారు. యూనివర్సిటీ భూముల కోసం విద్యార్థులు పోరాడుతుంటే విచక్షణారహితంగా విద్యార్థులను కొడుతూ అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం లో ప్రజాపాలన నడవడంలేదని, పోలీస్ రాజ్యం రాజ్యమేలుతుందని విమర్శించారు. యూనివర్సిటీ భూముల వేలా న్ని ఆపకపోతే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో బిజెపి నాయకులు మల్లేష్ యాదవ్, వెంకటేష్ జోషి, రామకృష్ణ చారిలు ఉన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATIOR AT ERRAGADDA, HYDERABAD (SOUTH) ARBITRATION CLAIM PETITION NO. 376 OF 2024

M/S RAO BROTHER'S CHIT FUND PRIVATE LIMITED, Khairathabad Branch, Hyderabad. ...Disputant

Vs.

Mr. Puppala Srikanth& OTHERS ...Opponents

To

1. Mr. Puppala Srikanth, S/o P.Yadaiah, R/o Fl.No.403,Block No.5, Green terrace Apartment, BandlagudaNagole, Hyderabad 500068.
2. Mrs. Goski Swetha, W/o P.Srikanth, R/o Fl.No.403,Block No.5, Green terrace Apartment, BandlagudaNagole, Hyderabad 500068.
3. Mrs. Puppala Tulasi, W/o G.Sankaraiah, R/o Fl.No.202,A-Block, Haritha Residency, Keshavapuri Colony, Sagar Road, Hasthinapuram, Hyderabad-500079.
4. Mr. Olati Yathindra, S/o O.Nagaraju, R/o H.No.4-6-26/1/1/41/P, Vasudevareddy Nagar, Near pillar no.136, Attapur, Hyderabad-500048.
5. Mr.Mangala Ramesh, S/o M.Ranga, R/o Fl.No.7227, Block No.7,Wing-2, Janapriya Metropolis And Classic Homes, Erragadda, Hyderabad-500018.

Please take notice that the above dispute is filed against you for recovery of Rs.6,21,603/-And the same is posted to date : 15-04-2025 for your appearance before the office of deputy registrar of chits/arbitrator, Hyderabad (South) 8-3-166/5/2, 2nd Floor, Naveen Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 3.00 pm if you fail to attend the office of deputy registrar of chit, Arbitrator on that day the case will be heard and decided exparte.

BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR

P.S.N.PADMA (Advocate) # 317 to 320, MODEL HOUSE, PANJAGUTTA, HYDERABAD-82.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATIOR AT ERRAGADDA, HYDERABAD (SOUTH) ARBITRATION CLAIM PETITION NO. 375 OF 2024

M/S RAO BROTHER'S CHIT FUND PRIVATE LIMITED, Khairathabad Branch, Hyderabad. ...Disputant

Vs.

Mr. Bhodupalli Karthik Kumar& OTHERS ...Opponents

To

1. Mr. Bhodupalli Karthik Kumar, S/oB.Baravaiah, R/o H.No.2-3-790/15/K/1, New Tulasi Ram Nagar, Golnaka, Amberpet,Hyderabad-500013.
2. Mr. BhodupalliSaidulu, S/o B.Baravaiah, R/o H.No.2-3-790/15/K/1, New Tulasi Ram Nagar, Golnaka, Amberpet,Hyderabad-500013.
3. Mr. GorreSrinivas, S/o G.Kashaiah, R/o H.No.2-3-790/20/62/A, New Tulasi Ram Nagar, Golnaka, Amberpet,Hyderabad-500013.
4. Mr. Gopas Shiva, S/o G.Niranjan, R/o o H.No.2-3-790/20/62/A, New Tulasi Ram Nagar, Golnaka, Amberpet,Hyderabad-500013.
5. Mr.AmbojiKiran Kumar, S/o A.Beeraiah, R/o o H.No.2-3-790/K/13, New Tulasi Ram Nagar, Golnaka, Amberpet,Hyderabad-500013.

Please take notice that the above dispute is filed against you for recovery of Rs.2,45,097/-And the same is posted to date : 15-04-2025 for your appearance before the office of deputy registrar of chits/arbitrator, Hyderabad (South) 8-3-166/5/2, 2nd Floor, Naveen Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 3.00 pm if you fail to attend the office of deputy registrar of chit, Arbitrator on that day the case will be heard and decided exparte.

BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR

P.S.N.PADMA (Advocate) # 317 to 320, MODEL HOUSE, PANJAGUTTA, HYDERABAD-82.


శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామినే నమః: శ్రీ సీతారామ చంద్రాయ నమః:



శ్రీ సీతారాముల వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవము

గాగిల్లాపూర్ గ్రామము, దుండిగల్ మున్సిపాలిటీ, మేడ్చల్ జిల్లా.

శ్లో ॥ రామాయ రామ భద్రాయ రామ చంద్రాయ వేదసే ! రఘునాథాయ నాథాయ సీతాయా పతయే నమః !!

స్వస్తి శ్రీ విశ్వావసు నామ సంవత్సరం తేది.04.04.2025 శుక్రవారం రోజున ఉదయం గం॥9.20 ని॥లకు ఉత్తరాయం, చైత్ర మాస సప్తమి శుభతిథి మృగశిర నక్షత్రయుక్త వృషభ లగ్న శుభపుష్కరాంశం నందు, తేది. 02.04.2025 బుధవారం నుండి 04.04.2025 శుక్రవారం వరకు పూజాకార్యక్రమాలు జరుగును.

శ్రీ గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వామి (శ్రీశైలం) వీరి శిష్యబృందంచే వీరశైవ ఆగమోక్త ప్రకారంగా జరుపబడును.

పూజాకార్యక్రమ వివరాలు :

తేది. 02.04.2025 బుధవారం ఉ॥8.30 గం॥లకు : గంగాపూజ, ముత్తయిదుల హారతులతో, బాజీ బజింత్రలతో ఆలయ ప్రవేశం. అఖండ దీపారాధన, గోపూజ, గణపతి, గౌరీపూజ, యాగశాల ప్రవేశం, స్వస్తి పుణ్యాహవాచనము, ఋత్విక్ వర్ణం, పంచగవ్యప్రాసనం, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ.
సాయంకాలం అగ్ని ప్రతిష్ఠ, సకల దేవత కలశ స్థాపనము, సర్వతోభద్రమండల ఉపరి ప్రధాన కలశ స్థాపనము, గణపతి హోమము, లక్ష్మీ గణపతి హోమము, వాస్తు హోమము, యంత్ర విగ్రహాలకు పంచగవ్య పంచామృత సహిత జలదివాసం, తీర్థ ప్రసాద వితరణ.

తేది : 03.04.2025 గురువారం ఉదయం 8.00 గం॥లకు : మంటప పునఃపూజ, మూలావిరాట్కు పంచామృత సహిత రుద్రాభిషేకం, నూతన విగ్రహాలకు పంచగవ్య, పంచామృత అభిషేకము, స్థాపిత మంటప హవనము, ప్రతిష్ఠ హోవనం, విగ్రహాలకు జీవచైతన్య కొరకు ధాన్యాధివాసం, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ.
సాయంకాలం 6.30 గం॥లకు మంటపారాధన, రుద్రహోమం, మృత్యుంజయ హోమం, మన్యుసూక్త హోవనం, మంగళహారతి, విగ్రహాలకు సుగంధ ద్రవ్య అభిషేకం, ఘృతాధివాసం, న్యాస ప్రకరణం, రాజోప చారాలు, పత్ర, పుష్ప ఫలాది సహిత శయ్య దివాసం.

తేది : 04.04.2025 శుక్రవారం ఉదయం : సుప్రభాతం, ప్రాతఃకాల పూజలు, పీఠ సంస్కరం, శుభముహూర్తంనందు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, విశేష అలంకారం, జయాధి హోమం, అష్ట బలిహారణ మహాపూర్ణాహుతి, హోమరక్ష, అష్టోత్తరం, అఖండ శాంతి కళ్యాణం, మహామంగళ హారతి, తీర్థప్రసాదం, ఋత్విక్ సన్మానం, మహాదాశీర్వచనం.

గమనిక : తేది. 06.04.2025 ఆదివారం రోజున సీతారాముల వారి కళ్యాణం మహోత్సవం జరుగును.



శ్రీమతి & శ్రీ మద్దికుంట సునీత - సంజీవరెడ్డి ఆలయ వ్యవస్థాపకులు

తేది.06.04.2025 ఆదివారం మధ్యాహ్నం గం॥2.00 లకు మహాఅన్నదాన కార్యక్రమం జరుగును.

ఆహ్వానించువారు : ఆలయకమిటీ, గాగిల్లాపూర్.

వార్త 29 ANNIVERSARY CELEBRATIONS

## నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి
## -ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


డ్రైనేజీ పైప్ లైన్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**వనస్థలిపురం ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**
ఎల్.బి.నగర్ నియోజకవర్గం లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎల్.బి.నగర్. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సి.ఐ. కాలనీ ఫేస్ 2.లో 55 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే కాలనీవాసులతో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్.సి.ఐ. కాలనీ నుండి జహంగీర్ నగర్ కాలనీ గుండా 450 ఎం.ఎం. డయా పైప్ లైన్ల నిర్మాణం జరుగుతుందన్నారు. దీంతో పరిసర కాలనీల ప్రజలకు డ్రైనేజీ సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజ శేఖర్ రెడ్డి, డివిజన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్త, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, నవీద్ ,మధుగౌడ్, జైపాల్ రెడ్డి, రాజు నాయి, ముకుంద రాజ్, నర్సింహా రావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం : దామోదర్


మార్కెట్ లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ జీఎస్ దామోదర్, గ్రేడ్1 కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి, అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 1, ప్రభాతవార్త:**
ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహద పడతాయని నగర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎస్ జీఎస్ దామోదర్, గ్రేడ్ 1 కార్యదర్శి చిలుక నరసింహారెడ్డిలు పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్లో రైతులు, హమాలీలు, వినియోగదారులు, వ్యాపారస్తుల సౌలభ్యం కోసం చల్లని త్రాగునీటిని అందుబాటులోకి తేవడం జరిగిందని, ఈ చలివేంద్రాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేకూరి వెంకటరమణ, వ్యాపారస్తులు కృష్ణ, జగదీష్, సురేష్, ఈశ్వరయ్య, విశ్వం, కొండల్ లతోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, మార్కెట్ హమాలీలు పాల్గొన్నారు.

### పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం : శ్రీపాల్‌రెడ్డి


సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

**సైదాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పలు రేషన్ దుకాణాల్లో పేదలకు సన్నబియ్యం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పేద వాడికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా సన్నబియ్యం పథకాన్ని తెలంగాణాలో చారిత్రాత్మకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### సన్నబియ్యంతో పేదల్లో ఆనందం : గోపాల్ ముదిరాజ్

**సైదాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రారంభించడంతో పేద ప్రజలు ఆనందంతో ఉన్నారని చంపాపేట డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ ముదిరాజ్ అన్నారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఉగాది కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన సన్నబియ్యం పథకం చరిత్రలో నిలిచిపోనుందన్నారు. గతంలో దొడ్డు ఇవ్వడంతో పక్కదారి పట్టేదని, అయితే ఇప్పుడు సన్నబియ్యంతో ఆ దందాకు చెక్ పడనుందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు.

### ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు సత్కారం


మహిళలకు అవార్డులు అందజేసిన ఎమ్మెల్సీ దయానందగుప్తా

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** కొత్తపేట మహిళా భవన్ లో సోమవారం ముత్తూట్ ఫైనాన్స్, కొత్తపేట లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా వివిధ రంగాలకు చెందిన 30 మంది మహిళలను సన్మానం చేసి అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొగారపు దయానంద్‌గుప్త, లైన్స్‌క్లబ్ హెల్త్ క్యాంప్ జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా, జోనల్ మేనేజర్ సంపత్, బ్రహ్మశ్రీ రామకృష్ణ చార్యులు, పి.అనూప్, లక్ష్మీనారాయణ అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, జి ,హిజిక్కియా, జితేంద్ర దేవి, అనురాధ, పద్మావతి, కర్ణ శ్రీనివాస్ రావు, రామకృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

### వేసవిలో చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్ ,మునిగంటి ప్రదీప్...

**కుషాయిగూడ ఏప్రిల్ 1, ప్రభాతవార్త :**
వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మాజీ ఎంపీసీ చైర్మన్ శ్రీధర్ కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ ఎస్బిఐ కాలనీ లోఉప్పల్ సర్వప్రాణి సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బిజెపి డివిజన్ అధ్యక్షులు మునిగంటి ప్రదీప్ తో కలిసి ఆయన ప్రారంభించారు. నియోజకవర్గం, మీర్పేట్ ఊః కాలనీ, వెంకటేశ్వరా నగర్ లో గత 30 సంవత్సరాలుగా "సర్వ ప్రాణి సమాజ్" ఆధ్వర్యంలో ఎన్నో భక్తి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యం వెంకన్న గౌడ్, సూర్య ప్రకాష్ లు పాల్గొన్నారు.


రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్.


గౌతమ్ నగర్ 141 డివిజన్ లో సన్నం బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు


సంజయ్ గాంధీ నగర్ లోనీ రేషన్ షాపు లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్


శివపురి కాలనీలో రేషన్ షాప్‌లో సన్నం బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు


బియ్యం పంపిణీ చేస్తున్న ఉపేందర్‌రెడ్డి, గణేష్‌నేత


సన్నబియ్యంతో చేసిన అన్నం తింటున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి


ప్రభుత్వం అందజేసే సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న నెమలి అనిల్‌కుమార్


సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన మల్‌రెడ్డి రాంరెడ్డి, పవన్‌కుమార్


సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

## సన్న బియ్యం పథకం చారిత్రాత్మక నిర్ణయం

**హస్తినాపురం డివిజన్‌లో...**
**వనస్థలిపురం.ఏప్రిల్.1.ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి సన్న బియ్యం పథకానికి ఎంతో ఆదరణ లభిస్తుందని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్ శెట్టి నగర్ నందనవనంలో చౌక ధరల దుకాణం వద్ద సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు డేరంగుల కృష్ణ గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మమతా మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

**మల్కాజిగిరిలో**
**మల్కాజిగిరి నఏప్రిల్.1.ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ 141 డివిజన్ లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ఆదేశాల మేరకు పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య చైర్మన్ సుజాత, బి బ్లాక్ ప్రెసిడెంట్ తుమ్మట్ల వెంకటేశ్ యాదవ్, బీ కే శ్రీనివాస, వాణీ నగర్ విజయ వినాయక దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సిరిగిరి రాజు, గౌతమ్ నగర్ 141 డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, డివిజన్ ప్రెసిడెంట్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లికార్జున నగర్ లోని అశుతోష్ రేషన్ దుకాణంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు.

**ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లో**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ఉప్పరగూడలోని సంజయ్ గాంధీ నగర్ లోనీ రేషన్ షాపు లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రారంభించడం జరిగింది ఈ సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ శైలం నాయకులు బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బీకే శ్రీనివాస్, ఉమేష్ సింగ్, బాబు, బ్రమ్మయ్య, రత్నభూషణ్ రావు, సోమయ్య, మధు, మోసీన్, అరుణ్, రాము, సిరిగిరి రాజు, తదితరులు పాల్గొన్నారు

**శివపురి కాలనీ లో**
**నేరేడ్ మెట్ ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పేద ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించిన ఘనత కేవలం బిజెపి ప్రభుత్వానికే దక్కుతుందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శివపురి కాలనీ లో ఉన్న రేషన్ షాప్ లో పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో అనిల్, రాజు, మురళి, నాని, చారీ, సంతోష్, సింహం పాల్గొన్నారు.

**లింగోజిగూడ డివిజన్‌లో...**
**సైదాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** రేషన్ దుకాణాల్లో పేదలకు సన్నబియ్యం అందించడం చారిత్రాత్మక నిర్ణయమని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పలు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. సన్నబియ్యంతో పేదలు మూడు పూటలు అన్నం తినగలుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కందికంటి శ్రీధర్ గౌడ్, పలుసం శ్రీధర్ గౌడ్, యశ్వంత్ రాజ్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, నరేందర్, నరేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

**ఆర్కేపురం డివిజన్ పరిధిలో...**
**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రేషన్‌షాప్ లో ఉచిత సన్న బియ్యం పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం పేదలకు వరమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా గణేష్‌నేత పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి సూచన మేరకు ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో రేషన్‌షాప్ వద్ద చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూధన్‌రావు, కుంచారపు సురేంద్రకుమార్, తలాటి రమేష్‌నేత, ఎన్ఎస్‌యుఐ శివ, గోదా కళ్యాణ్‌యాదవ్, పెద్దపూర సైదులు, లింగస్వామిగౌడ్, పగడాల శ్రీశైలం, సందీప్, బొడ్డుపల్లి మహేందర్, జయశ్రీ, శ్యామ్‌సుందర్, జెల్లా జగన్నాథం, ప్రశాంత్, నంద్యాల విప్లవ్, వసుదేవుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపేట డివిజన్ పరిధిలో...**
కొత్తపేట డివిజన్ శివగంగా కాలనీలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రేషన్ షాప్ లో సన్న బియ్యం పథకాన్ని రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, కార్పొరేటర్లు నాయికోటి పవన్ కుమార్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు హాజరై ప్రారంభించారు. తెల్లరేషన్‌కార్డ్ లబ్ధిదారులకు 5 కేజీల ఉచిత రేషన్ సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మిపతిగౌడ్, పెంటారెడ్డి, యాదగిరి, నాయకులు ఎండి.షరీఫ్, తోట మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

**మల్లాపూర్ డివిజన్‌లో...**
**నాచారం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న బిపిఎల్ కుటుంబంలోని ప్రతి సభ్యునికి మంగళవారం రేషన్ షాపుల్లో పంపిణీ చేశారు. మల్లాపూర్ డివిజన్ లోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పథకం కింద ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణి కార్యక్రమాన్ని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శిబి.సుదర్శన్, బొంగోని ఉమేష్ గౌడ్, దంతూరి రాజు గౌడ్, మెరుపుల బాల రాజ్ గౌడ్, జమీలా బేగం, కోయలకొండ రాజేష్, పర్వతాలు, ప్రభాకర్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కప్పరా సాయి కిరణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోయగూర బాలరాజ్ గౌడ్, కార్యదర్శి జానీభాయ్, జాఫర్, శీః. కిట్టు, సురేష్ గౌడ్, బీసి సెల్ అధ్యక్షులు మనోహర్, విళీగ్‌। అధ్యక్షులు బాతరాజు రాహుల్, మహిళా అధ్య క్షురాలు సోనీ గౌడ్, ఫిరోజ్ఖాన్, రవి, శైలజ, లక్ష్మి, లావణ్య, సునీత, సాయి, గణేష్, విష్ణు, సందీప్ పాల్గొన్నారు.

**బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో...**
**సరూర్‌నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నిరూపిస్తున్నదని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డిలు స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు సంబంధించిన 2, 3, 4, 5, 24, 25 డివిజన్లలో ప్రారంభమైన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని సరూర్‌నగర్ మాజీ జడ్పీటిసి బంగారు సత్యనారాయణ తదితరులతో కలిసి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయపల్లి వెంకట్‌రెడ్డి, నవారు ప్రభాకర్‌రెడ్డి, మల్గారి శ్రీధర్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, నవారు రాజిరెడ్డి, రాజు యాదవ్, డి.లక్ష్మయ్య గౌడ్, నర్సింహ, కొల్లూరు వంశీ, రామిడి మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి జంగారెడ్డి, పర్వత్ రవికాంత్‌రెడ్డి, సామ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

**నాదర్‌గుల్‌లో**
బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం లో మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలోని రేషన్‌షాపుల వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, పార్టీ నాయకులు పుట్టగళ్ల జగన్, బంగారి అశోక్, వెంకటేశ్ యాదవ్, బంగారి శంకర్, గడ్డం భాస్కర్‌రెడ్డి, రేషన్ డీలర్ జెనిగె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ పైపులైన్‌ల నిర్మాణానికి నిధులు తెచ్చింది నువ్వా? నేనా : కార్పొరేటర్ రాగుల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాగుల తదితరులు.

**వనస్థలిపురం. ఏప్రిల్.1.ప్రభాతవార్త.** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సి.ఐ. కాలనీలో డ్రైనేజీ పైపులైన్‌ల నిర్మాణానికి నిధులు తెచ్చింది నువ్వా, నేనా ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కి వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి సూచించారు. ఎఫ్.సి.ఐ కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడాన్ని కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వనస్థలిపురం ఎఫ్.సి. ఐ. కాలనీలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎఫ్.సి.ఐ కాలనీకి డ్రైనేజీ పనుల నిమిత్తం 55 లక్షల రూపాయల ను మంజూరు చేయించానని, తనకు సమాచారం ఇవ్వకుండా ,తాను తెచ్చిన నిధుల తో ఎమ్మెల్యే ఎలా శంఖుస్థాపన చేస్తారని ధ్వజమెత్తారు. మూడు సార్లు ఎమ్మెల్యే గా పనిచేసిన సుధీర్ రెడ్డి ప్రోటోకాల్ తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో కి వచ్చిన 6 నెలలలోనే 12 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు టి.పి.సి.సి చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సహకారంతో చేపట్టడం జరిగిందన్నారు. నిధులు తేవడం చేతకాక ,వనస్థలిపురం డివిజన్ లో అభివృద్ధి ని చూసి ఓర్వలేక ఇలాంటి దిగజారుడు పనులు చేస్తున్నాడని ఆరోపించారు. త్వరలో మంత్రి శ్రీధర్ బాబు తో ,మాధుయాష్కీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని, ఎమ్మెల్యే కు కూడా సమాచారాన్ని ఇస్తామన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు నెలపాటి రామారావు, అశోక్ గౌడ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుట్ల నరసింహ యాదవ్, భూపతిరెడ్డి, సాయి గౌడ్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికి సన్న బియ్యం : పరమేశ్వర్‌రెడ్డి


ఉప్పల్‌లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్ రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి సన్న బియ్యం అందజేస్తున్నామని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, చిలుకానగర్, హబ్సిగూడ, రామంతాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు ఉచితంగా సన్న బియ్యం అందజేస్తున్నారని, పేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కొ లబ్దిదా రుడిని 6 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నారని, నలుగురు ఉన్న కుటుంబానికి 24 కిలోల బియ్యం ఉచితంగా అందజే స్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజేష్ ముదిరాజ్, రఘుపతిరెడ్డి, బజారు జగన్‌గౌడ్, కొంపల్లి బాలరాజు, ఆగంరెడ్డి, బొమ్మగో ని దాస్‌గౌడ్, అమరేశ్వరి, బల్వంతరెడ్డి, మహేందర్, సుశీల, రాధాకృష్ణ, సురేష్, జంగయ్య, గణేష్, గీత, శోభ, ఉప్పల్ డివిజన్ నేతలు బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, దేవిరెడ్డి, పాశికంటి నాగరాజు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్క ర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఈగ శంకర్, మహేష్, కృష్ణారెడ్డి, నాగారం వెంకటేష్, పూజారి హనుమంతు, రాజు, అరుణ్, ప్రశాంత్‌రెడ్డి, రంగుల శేఖర్, హబ్సిగూడ సీనియర్ నేతలు కంది ఆగిరెడ్డి, బి.సుధాకర్‌రెడ్డి, బిళ్లకంటి యాదయ్య, ఉపేందర్‌రెడ్డి, గణేష్‌నాయక్, కంది శ్రవణ్‌రెడ్డి, గరిక సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు విజయ్, మురళీ, శ్రీనివాసా చారి, ధర్మేందర్‌నాయక్, బాలయ్య, కిషోర్, నరసింహ్, ప్ర కాష్, ఆకుల సురేష్, మల్లయ్య, సంజీవ్, కొమరయ్య, నయిమ్, భాస్కర్, నాగచారి, బాబీ, ధన లక్ష్మి, శిరీష, జ్యోతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎలివేటెడ్ కారిడార్ పనుల నిర్లక్ష్యానికి నిరసనగా ధర్నా


ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి చేయాలని చేపడుతున్న నిరసన కార్యక్రమం కరపత్రం అవిష్కరిస్తున్న నేతలు

**ఉప్పల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్ పనుల నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 4వ తేదిన ఉప్పల్ ప్రధాన రహదారిలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘం నేతలు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో ఉప్పల్ గ్రామ పెద్దలు దుబ్బ నరసింహారెడ్డి, మేకల శివారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, మేకల హనుమంతరెడ్డి, బజారు జగన్‌గౌడ్, గోనె అర్జున్‌రెడ్డి, బిక్కుమళ్ల అంజయ్యగుప్త, గిరి రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో అనేక మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పనులు పూర్తి చేయాలని కోరుతూ భారీ ఎత్తున నిరసన చేపడుతున్నామని, ఉప్పల్ గాంధీ విగ్రహం వద్ద జరిగే ఈ కార్యక్రమానికి ఉప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహంకాళి లక్ష్మణ్, జి.శ్రీనివాసశర్మ, మార్నెని ఫణీంద్ర, నర్సిరెడ్డి, మేకల దయాసాగర్‌రెడ్డి, నెర్థం భాస్కర్‌గౌడ్, జెల్లి మోహన్, పి.జితేందర్‌రెడ్డి, పంగ మహేందర్‌రెడ్డి, బింగి భరత్‌గౌడ్, పంగ రాజేశ్వర్‌రెడ్డి, పోగుల సోమిరెడ్డి, సత్యరాజ్‌గౌడ్, కాయ హనుమంతు, జగన్, నవీన్‌గౌడ్, జహంగీర్, జగదీశ్వర్‌రెడ్డి, మేకల రాంరెడ్డి, సంతోష్‌రెడ్డి, నరసింహ్, కల్లూరి వేణు, సుప్రీత్‌సింగ్, ఎస్ఎస్ శేఖర్‌సింగ్ పాల్గొన్నారు.

### పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం


సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో చిలుక మధుసూదన్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని... ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనాజిపూర్ గ్రామంలో రేషన్‌దుకాణం వద్ద లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల గుండె చప్పుడన్నారు. అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### గ్రూప్-1 పరీక్షల్లో టాప్ 5 ర్యాంకు సాధించిన సిద్దాల కృతికకు సబితా ఇంద్రారెడ్డి అభినందనలు


సిద్దాల కృతికను సన్మానించి అభినందిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో కృతిక తల్లిదండ్రులు మాజీ ఎంపిపి సిద్దాల లావణ్య, బీరప్ప ఉన్నారు.

**సరూర్‌నగర్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్-1 సర్వీసుల పోస్టులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (టిజిపిఎస్‌సి) నిర్వహించిన రాత పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో టాప్-5 ర్యాంకును సాధించిన మహేశ్వరం నియోజకవర్గం బాలా పూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ పాత గ్రామానికి చెందిన సిద్దాల కృతికను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సన్మానించి అభినందించారు. పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ జిల్లెలగూడ తాజా మాజీ కార్పొరేటర్ అయిన సిద్దాల లావణ్య, జిల్లెలగూడ పాత గ్రామ పంచాయతీ మాజీ వార్డు మెంబర్ అయిన సిద్దాల బీరప్ప కురుమల ఏకైక కుమార్తె అయిన సిద్దాల కృతిక గ్రూప్-1 పరీక్ష రాత పరీక్షల్లో 5వ ర్యాంకు సాధించిన విషయం తెలుసుకున్న సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. ఈ మేరకు ఆమె స్వయంగా జిల్లెలగూడ వెంకటేశ్వరనగర్ కాలనీలోని సిద్దాల నివాసానికి మంగళవారం ఉదయం తరలివచ్చారు. ఈ సందర్భంగా కృతికను శాలువాతో సన్మానించి పూలకుండీ అందజేసి స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపా రు. అదే విధంగా కూతురిని ప్రోత్సహించి ఆమె భవిష్య త్తుకు బంగారు బాటలు వేసిన లావణ్య, బీరప్పలను సైతం సబితా ఇంద్రారెడ్డి సత్కరించి అభినందనలు తెలిపారు.

### సన్నబియ్యం పంపిణీ పేదలకు వరం: పారిజాత


సిఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి బాలాపూర్‌లో పాలాభిషేకం చేస్తున్న మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ పేద ప్రజలకు వరమని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభమైన నేపథ్యంలో స్వగ్రామం బాలాపూర్‌తో పాటు బడంగ్‌పేట్‌లలో ఆమె రేషన్‌షాపులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయలేదనీ రాష్ట్రంలో తొలి సారిగా పేదలకు సన్నబియ్యం అందజేసిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఆమె సిఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు ఎర్ర జైహింద్, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, మేకల సంజీవ, నీరుడు శ్రీరాములు, వంగేటి కొండల్‌రెడ్డి, పెద్దబావి సమరసింహారెడ్డి, టేకుల శశిధర్‌రెడ్డి, క్యారగారి శ్రీధర్, ఇక్కె శ్రీనివాస్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లెలగూడ వెంకన్న దేవాలయంలో ఫ్లోరింగ్‌కు రూ.3,66,999 విరాళం


చెక్కును అందజేస్తున్న దాత, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఉత్తర ద్వారం గల అరుదైన జిల్లెలగూడ శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ కోసం గ్రామానికి చెందిన మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి రూ.3,66,999 లను విరాళంగా అందజేశారు. ఆలయ గర్భగుడి చుట్టూ ఉన్న విశాలమైన ప్రాంగణంలో పాత ఫ్లోరింగ్ శిథిలమవ్వడంతో రూ.16,50 లక్షల అంచనా వ్యయంతో దాతల సహకారంతో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులను చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో బొక్క రాజేందర్‌రెడ్డి తనవంతుగా భారీ మొత్తాన్ని ఫ్లోరింగ్ కోసం విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన రూ.3, 66,999లకు సంబంధించిన చెక్కును ఆయన ఆలయ ఇఒ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి డింగరి రామాచారి, ఆలయ సిబ్బంది శ్రీకాంత్, అశోక్‌లు పాల్గొన్నారు.


కేటీఆర్‌కు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మనోహర్ ఖాన్ తదితరులు